క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న తహసీల్దార్ భార్గవి

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై కుల వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ భార్గవి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లమాల గ్రామ పంచాయతీ పరిధిలోని సుద్దమిట్ట ఎస్టీ కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, పోలీసుశాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వివక్షకు గురైతే తెలియజేయాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత గోపాల్‌రెడ్డి, ఆర్ఐ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రాచపాళెంకు ప్రభుత్వ పాఠశాల మంజూరు

సత్యవేడు: మండలంలోని రాచపాళెం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు ఎంఈఓ కె. రవి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయని చెప్పారు. గ్రామంలో 56 మంది బడి పిల్లలు ఉన్నారన్నారు. ప్రాథమిక పాఠశాలలో 35 మంది బడిలో చేరే అవకాశం ఉందన్నారు. నీటివసతి, బాల బాలికలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు తగిన వసతులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ రూబెన్ తెలిపారు. వారంలోపు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా పాఠశాల ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.

పోషకాహారం ఆరోగ్యానికి రక్ష

నారాయణవనం: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని ఆరోగ్య కార్యకర్తలు అన్నారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులు, కిషోర బాలికలతో సమావేశాన్ని నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, గుడ్డు తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడవచ్చని తెలిపారు.

పాఠశాలల్లో స్వచ్ఛత పక్వాడా



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశుభ్రతపై విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ భాగస్వామ్యంలో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

చంద్రయాన్ విజయోత్సవాలు



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చంద్రయాన్ -3 విజయవంతంపై ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ ప్రజ్ఞాన్ రోవర్ చంద్రునికి సంబంధించిన విలువైన సమాచారాన్ని సేకరించి పంపుతున్న నేపథ్యంలో వారం రోజుల పాటు విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదిత్య ఎల్-1 ప్రయోగాన్ని వీక్షించడానికి శనివారం తమ విద్యార్థులు శ్రీహరికోటకు వెళ్లనున్నట్లు చెప్పారు. అధ్యాపకులు మురళి, పరంధామయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



ఏర్పేడు: మండలంలోని పెద్దఅంజిమేడులో శుక్రవారం ముత్యాలమ్మ ఆలయ కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల విరాళాలతో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ముందుగా ఆలయంలో హోమం, కలశ స్థాపన చేశారు. ముత్యాలమ్మ విగ్రహానికి వివిధ రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.







రేణిగుంట: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, ఏర్పేడు: పింఛన్ అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివయ్య, ఎండీపుత్తూరులో సీఎం చిత్రపటానికి మొక్కుతున్న వృద్ధురాలు పుట్టాలమ్మ

జగనన్నతోనే అన్ని వర్గాలకు సంక్షేమం

నారాయణవనం: అన్ని వర్గాల వారికి సంక్షేమం, న్యాయం చేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ భవనంలో జరిగిన సమావేశంలో 125 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుకను అందజేశారు. కొత్తగా పింఛన్ అందుకున్న లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతోందన్నారు. ఇచ్చిన హామీలకు తోడు ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను గుర్తించి మరిన్ని పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంటే పచ్చ పార్టీ గుర్తించకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా అత్యధిక మొత్తంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో లబ్ధిపొందారని తెలిపారు. వివిధ కారణాలతో ఆగిన వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి సెప్టెంబర్ నుంచి పింఛన్ మంజూరైందని ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శనరెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, అన్నాదొరై, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు.



నారాయణవనం: వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పింఛన్ల పంపిణీ

రేణిగుంట: మండలంలోని అత్తూరులో శుక్రవారం ఉదయం ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంతో భేషుగ్గా సాగుతోందన్నారు.

ఏర్పేడు: మండలంలోని గ్రామాలన్నింటిలో ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి సర్పంచ్‌లు, వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛను అందజేశారు. ఈ క్రమంలో ఎండీ పుత్తూరులో వృద్ధురాలు చింత పుట్టాలమ్మ ముఖ్యమంత్రి జగన్ చిత్ర పటానికి చేతులెత్తి దండం పెట్టి కృతజ్ఞతలు తెలిపింది.

నాగలాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా శుక్రవారం నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగలాపురం మండలంలో కొత్తగా 123 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీపీ సుధాశ్యామ్, వైస్ ఎంపీపీ కుమారి, పార్టీ నాయకులు అపరంజిరాజు, చిన్నదొరై, సురేష్, మోహన్ మొదలియార్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో తొలి రోజు 96 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కంచనపుత్తూరు గ్రామానికి చెందిన రత్నమ్మకు వలంటీర్ జ్యోతి పింఛన్ అందజేశారు.







పిచ్చాటూరు: కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపతి ఆస్పత్రిలో రత్నమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్, బుచ్చినాయుడుకండ్రిగ: పల్లమాల గ్రామంలో..

సుపరిపాలనకే ప్రజాశీస్సులు

పిచ్చాటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు ప్రజాశీస్సులు ఉంటాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా పింఛను మంజూరైన అవ్వాతాతలకు నగదు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో కొత్త పింఛన్ల రూపంలో 286 మందికి రూ.3,66,250లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నామని, జగనన్న ముఖ్యమంత్రిగా ఉండడం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. మళ్లీ జగనన్ననే గెలిపించుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోరారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రిని అసభ్యంగా దూషిస్తున్న టీడీపీ నేతలకు ప్రజలే బుద్ధిచెబుతారని స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు మాని తన వెంట వస్తే నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు చూపిస్తామని తెలిపారు. గోవర్ధనగిరిలో సచివాలయం, ఆర్‌బీకే, ఆస్పత్రి భవనాలు నిర్మిస్తే స్థానిక టీడీపీ నేత మాధవ నాయుడు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంఈఓ యుగంధర్ రాజు, సర్పంచ్‌లు అన్నాదురై, కిరణ్‌కుమార్, రాజగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, బేమమ్మ, శోభ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, సింగిల్ విండో మాజీ చైర్మన్ శేఖర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

పాలసముద్రం: మండలంలో కొత్తగా 121 మందికి మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. పాలసముద్రం సచివాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, సర్పంచ్ అయ్యప్ప చేతుల మీదుగా లబ్ధిదారులకు నగదుఅందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ ఆమోదం ఉంటేనే ప్రభుత్వ పథకాలు వచ్చేవన్నారు. ఆ పార్టీ నాయకులే ఎక్కువ లబ్ధి పొందేవారన్నారు. పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తోందని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పింఛన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రాజు, రాజామణి, గోపాల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నరామిరెడ్డి, పెద్ద గంగిరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. సమాచారం అందుకున్న మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రా రెడ్డి శుక్రవారం వారిద్దరినీ పరామర్శించారు. త్వరగా ఆరోగ్యం కుదుటపడాలని కోరారు. మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నరసింహులు, నాయకులు వెంకట్, శుభారెడ్డి, అల్లయ్య, గిరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చెంచురామిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సత్యవేడు: ఉపాధి కూలీలకు రూ.272 కూలి వచ్చేలా పనులు కల్పించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అలిమేలు మంగాపురంలో జరుగుతున్న వరవ కాలువ పనులను ఆయన పరిశీలించారు. రైతులు, గ్రామస్తులకు ఉపయోగపడే పనులను చేయించాలని సిబ్బందికి సూచించారు. పనులు జరిగే ప్రాంతాల్లో తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. మస్టర్లు, కాలువ కొలతలు పరిశీలించారు. ఏపీఓ కృష్ణయ్య, ఫీల్డు అసిస్టెంట్ బాలచంద్ర, మేట్ మునిరాజమ్మ ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలోని 77 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ తేజేశ్వరి ఆదేశాల మేరకు శుక్రవారం ఏఎన్‌ఎం సుధా ఆధ్వర్యంలో విద్యార్థులు హెచ్ బి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపి, ఉపాధ్యాయుడు ముని రాజా పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి

కేవీబీపురం: మండలంలోని శ్రీనివాసపురం(మారెప్పరెడ్డికండ్రిగ)లో శుక్రవారం రవిచంద్ర అనే వ్యక్తి మద్యం మత్తులో చిన్నబ్బపై దాడి చేశాడు. ఎస్ఐ సునీల్ కథనం మేరకు, రవిచంద్ర తన సెల్‌ఫోన్‌ను గ్రామానికి చెందిన వృద్ధురాలు విశాలమ్మ కాజేసిందన్న అనుమానంతో దాడికి యత్నించాడు. విశాలమ్మ కుమారుడు చిన్నబ్బ అడ్డుకోవడంతో అతడిపై కోడికత్తితో దాడి చేశాడు. చిన్నబ్బ సోదరుడు చెల్లయ్యకు చెందిన మేకపోతును చంపి అక్కడి నుంచి ఉడాయించాడు. అప్పటికే ఫిర్యాదు అందుకున్న పోలీసులు కొంతసేపటికే నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి విచారిస్తున్నారు. కత్తిపోట్లకు గురై తీవ్రంగా గాయపడ్డ చిన్నబ్బ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

బస్సు కిందపడి విద్యార్థికి గాయాలు

కేవీబీపురం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థి శుక్రవారం ఆర్టీసీ బస్సు కింద పడడంతో గాయపడ్డాడు. పెరిందేశం గ్రామానికి చెందిన ప్రతాప్(15) కళాశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతూ కింద పడిపోయాడు.వెంటనే తోటి విద్యార్థులు వెనక్కి లాగేసినా, అప్పటికే చేతివేళ్లపై బస్సు టైర్లు ఎక్కేశాయి. దీంతో చేతి వేళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. అయినప్పటికీ బస్సును ఆపకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై ఉపాధ్యాయులు కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



పర్యావరణ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

రేణిగుంట: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఏపీ ఎన్‌జీసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ నీలకంఠ అన్నారు. మండలంలోని కరకంబాడి ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏపీ నేషనల్ గ్రీన్ క్రాప్స్, ఎంవోఈఎఫ్ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్‌పై ఫారిన్ మినిస్టర్ ట్రాక్, లీడర్స్ మోడల్ జీ-20 సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒక్కొక్కరు ఒక్కొక్క దేశం అధ్యక్షులు, ప్రధానిగా మాక్ డ్రిల్ నిర్వహించి ఆ దేశాల్లో వారు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను తెలుపుతూ పరిష్కార మార్గాలను వివరించారు. 10వ తరగతి విద్యార్థిని నందిని భారత ప్రధానమంత్రిగా మారి మన దేశంలోని పర్యావరణ సమస్యను తెలియజేశారు. పలువురు విద్యార్థులు ఆయా దేశాల ప్రతినిధుల వేషధారణలో పాల్గొని అక్కడ నెలకొన్న పర్యావరణ పరిస్థితులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఇందిరాదేవి, హెచ్‌ఎం పుష్పలత, జిల్లా కో-ఆర్డినేటర్ హరిశంకర్, నేమిలేటి కిట్టన్న, తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్ ప్రతినిధి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగనన్న



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పింఛనుదారులు

ఏర్పేడు: సంక్షేమ పథకాల ప్రదాతగా పేరుగాంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నూతన పింఛన్ల పంపిణీ చేశారు. ఈసారి నూతనంగా 185 పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. కొత్త పింఛనుదారులు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిడ్డయ్య, వైస్‌ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణయ్య, సర్పంచ్‌లు రాజ్యలక్ష్మి, మునిరామయ్య, నాయకులు మునిరత్నం నాయుడు, పోలయ్య, పింఛనుదారులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



అశోక్ (ఫైల్)

ఏర్పేడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు, మండలంలోని కందాడు దళితవాడుకు చెందిన పారి అశోక్(23) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి వస్తుండగా ముసలిపేడు బత్తెనయ్య కాలనీకి సమీపంలోని గుంతలో ప డ్డాడు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి సాయం అందిస్తున్న లోకేశ్వరి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌కు చెందిన సిరాజమ్మ భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం సామాజికవేత్త లోకేశ్వరి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు నగదు సాయం అందించారు. గతంలోనూ ఇక్కడ పలు సామాజిక కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు అండగా నిలుస్తున్న లోకేశ్వరిని స్థానికులు అభినందిస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నారాయణవనం: అభివృద్ధి, సంక్షేమ పథకాలతో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. శుక్రవారం నారాయణవనంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందరికీ మేలు చేస్తున్నారని తెలిపారు. ప్రజల్లో ఆయనకు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేని టీడీపీ నాయకులు, పచ్చ మీడియా బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్‌కు నియోజకవర్గంలో ఒక ఊరు పేరు కూడా తెలియదని ఎద్దేవా చేశారు. పక్క రాష్ట్రం తమిళనాడుకు చెందిన ఆయనకు ఇక్కడి పరిస్థితి కూడా తెలియవన్నారు. ఏం మాట్లాడాలో తెలియక ప్రభుత్వం, తమ పార్టీ నేతలపై విమర్శలు చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, సచివాలయ మండల కన్వీనర్ కోనేటి బాబు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, కైలాసకోన ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం, సర్పంచ్‌లు సాయిరవి, మురుగేశం, ధర్మలింగం, రామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యులు పొన్నుస్వామి, రవి, మణిరెడ్డి తదితరులు ఉన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



ఐఐటీ తిరుపతిలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న నయీముల్లా

ఏర్పేడు: పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ నయీముల్లా అన్నారు. మండలంలోని ఐఐటీ తిరుపతి, కొత్తవీరాపురం కాజ్‌వేను శుక్రవారం పరిశీలించారు. ఐఐటీ తిరుపతిలో ఆధునిక ప్రమాణాలతో ఉన్న ల్యాబ్‌లు, విద్యార్థుల తరగతి గదులు, కొత్తవీరాపురం వద్ద నూతనంగా నిర్మించిన కాజ్‌వే నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో చేపట్టడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సుధాకర్‌రెడ్డి, డీఈ నాగమల్లయ్య, సూపర్ వైజర్ మురగయ్య నాయుడు పాల్గొన్నారు.

పోషకాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం

వరదయ్యపాళెం: పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దేవకుమారి అన్నారు. జాతీయ పోషకాహార మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని బత్తలవల్లం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే జామ, బొప్పాయి, ఉసిరి, మునగాకు, కరివేపాకు, వేరుశనగలు వంటి వాటిని గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు తీసుకోవాలన్నారు. అనంతరం పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. పోషకాహారం తీసుకుంటే రక్తహీనత నివారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ జ్యోతి, స్థానిక సచివాలయ కన్వీనర్ గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: పౌష్టికాహారంతో తల్లి, బిడ్డ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చెంచులక్ష్మి, యమున అన్నారు. మండలంలోని వీఎస్ పురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రతి నెలా రెండున్నర కిలోల బాలామృత ప్యాకెట్లు, 25 గుడ్లు, పాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద కిలో అటుకులు, రాగిపిండి, జొన్న పిండి, పావు కిలో బెల్లం, పావు కిలో ఎండు ఖర్జూరాలు, చిక్కీలు, 25 గుడ్లు, నాలుగు లీటర్ల పాలు అందజేస్తున్నామన్నారు.



బీఎన్ కండ్రిగ: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది